క్లుప్తంగా

కృష్ణాలయంలో ప్రత్యేక పూజలు


లలిత పారాయణలో మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం యాదవ వీధిలోని శ్రీకృష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు శ్రీకృష్ణుడికి పాలు, పెరుగులతో అభిషేకాలు చేశారు. శ్రావణ మాసం సందర్భంగా యాదవ సంఘం ప్రతినిధులు, సభ్యులు స్వామికి ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీవాసుదేవ అన్నమాచార్య పద సంకీర్తనా నామావళి నుంచి పలువురు మహిళలు, స్థానిక యాదవ సామాజిక వర్గాని చెందిన మహిళలు మందిరం వద్ద లలితా పారాయణం, గోవింద నామాలను పఠించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలో శ్రీ సాయి ఆశ్రమాల వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం శ్రీ సాయిబాబా ఆలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సాయి సేవకులు సాయిరుత్విక్, వీరేశ్వరరావు, సాయి సేవక్, డీవీఎస్ భాస్కర్, నాయకులు సత్యనారాయణ, నీలంరాజు పాల్గొన్నారు.

చెట్ల నరికివేతపై విచారణ

జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: గోపాలపట్నం బంక్ సమీపంలోని వుడా కాలనీ పార్కులో చెట్లు కొట్టడంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. దీనిపై శనివారం సాక్షిలో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. పార్కుల్లో చెట్లు కొట్ట కూడదని తెలిపారు. ఇది చాలా నేరమన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు. ఈ చెట్లను ఎవరు కొట్టారు, ఎవరి ప్రేరణతో ఈ చర్యలకు పాల్పడ్డారన్న అంశాలను విచారిస్తున్నామన్నారు. దీనిపై హార్టీ కల్చర్ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. వారి నివేదిక మేరకు చర్యలు చేపడతామని తెలిపారు.

నాగుపాము కలకలం


నాగుపామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కిరణ్

సీతమ్మధార: నరసింహనగర్‌కు చెందిన సీపీ అవధాని ఇంట్లోకి శుక్రవారం అర్ధరాత్రి నాగుపాము (స్పెక్టికల్ కోబ్రా) చొరబడింది. వంట గదిలోని పోపుల డబ్బాల మధ్య ఇమిడి ఉన్న ఆ పామును శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో చూసి అవధాని కుటుంబ సభ్యులు భయాందోళలనకు లోనయ్యారు. వెంటనే గాజువాకలోని స్నేక్ కిరణ్‌కు సమాచారం అందజేశారు. అతను హుటాహుటిన వచ్చి చాకచక్యంగా నాగుపామును బంధించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్నేక్ కిరణ్ మాట్లాడుతూ పాములు ఇళ్లలో, కార్యాలయాల్లో చొరబడినప్పుడు భయపడకుండా, 88663-68899 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

డంపింగ్ యార్డులా కొత్తపాలెం!


వ్యర్థాల్లో చెత్తను కాల్చి వేసిన వైనం

- ఇష్టానుసారంగా వ్యర్థాల డంపింగ్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు


కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే దారిలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో పలు ప్రాంతాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. భగత్‌సింగ్‌నగర్ నుంచి నరవ వెళ్లే రోడ్డులో దారి పొడవునా గృహ నిర్మాణ వ్యర్థాలతో పాటు పలు వ్యర్థాలు డంప్ చేశారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఇందులో వ్యర్థాలకు నిప్పు పెట్టి వదిలేస్తున్నారు. జీవీఎంసీ ప్రాంతంలో వ్యవర్థాలకు నిప్పు పెట్ట కూడదన్న నిబంధన ఉన్నా వాటిని పట్టించుకోకుండా కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ఉన్న రియల్ వ్యాపారులే ఇందుకు కారణమని చెబుతున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కూడా చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. డెబ్రిస్ వేసేందుకు జీవీఎంసీ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. అలా తీసుకోకుండా యథేచ్ఛగా వేస్తున్నారు. లారీలు, ట్రాక్టర్ల రాకపోకల వల్ల కూడా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు

కొత్తపాలెంలో డెబ్రిస్, వ్యర్థాలు వేసినట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై పరిశీలించి చర్యలు తీసుకుంటాం. గార్బేజ్ వంటి వ్యర్థాలు వేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. గృనిర్మాణ వ్యర్థాలు వేసినట్లయితే టౌన్ ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– కృష్ణం రాజు ఏఎంహెచ్‌ఓ

అనుమతి తప్పనిసరి

గృహనిర్మాణ వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకూడదు. ముందుగా అనుమతి తీసుకుని ఆ ప్రాంతంలోనే వేయాలి. అందులో వచ్చే చెత్తను కాల్చడం నేరం. దీనిపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

–జయరామ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ

గోకుల యాదవ సామాజిక భవనం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో మేయర్ హరి వెంకటకుమారి, ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు జింక్ ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన గోకుల యాదవ సామాజిక భవనాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. తొలుత ఇక్కడ శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఐక్యతకు నిదర్శనం యాదవులు అన్నారు. యాదవులంతా ఐక్యతతో సామాజిక భవనం నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు.వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ యాదవ సంఘాల సంక్షేమానికి తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందన్నారు. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీసురేష్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు పుర్రె అప్పారావుయాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంత, పశ్చిమ పరిధి యాదవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన పాలక సభ్యులకు అభినందన

మల్కాపురం: నూతన కార్యవర్గ ప్రతినిధులు తమ సంఘ ఉన్నతికి నిరంతరం శ్రమించాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సూచించారు. 61వ వార్డు మల్కాపురం శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘానికి ఇటీవల కొత్త కార్యవర్గం ఎన్నికైన సంగతి తెలిసింది. నూతన సంఘం ప్రతినిధులు శనివారం ఆనంద్‌కుమార్‌ను ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి, రాధాకృష్ణుల జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఆడారి నూనత కార్యవర్గ సభ్యులను అభినందించారు. సంఘ సభ్యుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్


అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కొణతాల సుధ

మల్కాపురం: నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమసమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చెప్పారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హరిజనవీధి వద్ద పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమి పూజ చేశారు. మల్కాపురం మెయిన్ రోడ్డు నుంచి మార్కెట్ మార్గం, హరిజనవీధి వరకు సీసీ రోడ్డు వేయనున్నట్టు చెప్పారు.గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామని ఆయన వివరించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము),కేబుల్ వాసు,జేసీఎస్ కన్వీనర్ భోగవల్లి నాగభూషణం,కొల్లి నూకరెడ్డి,బూస అప్పలరెడ్డి,మంగ,లలితకుమారి,దాసరి రవి,మూగి సూర్యనారాయణ,కాకర గోవింద్,హరికృష్ణ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం


మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 56వ వార్డు కంచరపాలెం పరిధి రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం ప్రాంతాల్లో శనివారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావుతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవలందించాలనే ధ్యేయంతోనే సచివాలయం- వలంటీర్ వ్యవస్థను సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేశారన్నారు. వ్యక్తిగత లాభాల కోసం పర్యటనలు చేస్తున్న ప్రతిపక్షాలపై ఆయన విరుచుకుపడ్డారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో 52, 56, 57 వార్డుల క్లస్టర్ ఇన్‌చార్జి పల్లా ఎర్నికుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు దాసరి శామ్యూల్, రామకృష్ణ, సంతోష్, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, వలంటీర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయాలతో పడి ఉన్న కుంజుమాన్

గోపాలపట్నం: కాకానినగర్ జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. నగరం నుంచి గాజువాక వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకుడు కాకానినగర్ వద్ద జాతీయ రహదారి దాటుతున్న విమాన్‌నగర్‌కు చెందిన కె.ఆర్.కుంజుమాన్ అనే వ్యక్తిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి గాయపడి వ్యక్తిని కారులో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో 108లో అదే ఆస్పత్రికి తరలించారు. ద్విచక్ర వాహనదారుడిని గాజువాకకు చెందిన గణేష్‌కుమార్‌గా గుర్తించారు. పాదచారుడు కుంజుమాన్ అపస్మారక స్థితిలో ఉన్నాడు.

పేద గుండెకు ఆడారి అండ


గుండె వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: నిరుపేదలకు అండగా నిలబడేందుకు ఉచిత గుండె వైద్య శిబిరాలు నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 57వ వార్డు సాకేతపురంలో ఆడారి తులసీరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని శనివారం ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలో కంటి వైద్యశిబిరాలు, గుండె వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 60 మందికి బీపీ, సుగర్ పరీక్షలతో పాటు ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. ఇందులో ఆరుగురికి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించారు. పలువురికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో 57వ వార్డు కార్పొరేటర్ ముర్రు వాణి, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్ కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు అప్పలరాజు, కృష్ణవేణి, దమ్ము గోవిందు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో విశేష పూజలు


సంపత్ వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


కలియుగ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తులు

కంచరపాలెం: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామ్ ఆచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు చేశారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. భక్తులకు ప్రత్యేక దర్శనాలు కల్పించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకరశర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు, కార్యదర్శి రాజు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలి

జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు డాక్టర్ వావా


మాట్లాడుతున్న జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా

దాబాగార్డెన్స్ : సమాజంలో సఫాయి కార్మికులు గౌరవంగా జీవించాలని జాతీయ కమిషన్ సఫాయి కర్మచారి సభ్యుడు, స్టేట్ సెక్రటరీ డాక్టర్ పీపీ వావా పేర్కొన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013 అమలు చేయాలని, సఫాయి కర్మచారుల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులు అధ్యయనం చేసి వారు సమాజంలో గౌరవంగా జీవించే అవకాశం కల్పించాలని తెలిపారు. ఆయన శనివారం విశాఖలో పర్యటించారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సఫాయి కార్మికుల ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎంఎస్ యాక్ట్ 2013లో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో కమిషన్ గట్టి ప్రయత్నం చేస్తోందని, రాష్ట్రాలు, మున్సిపాల్టీలు, ఓడరేవుల అధికారులు, వివిధ సంఘాలు, జిల్లా అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. పునరావాస చట్టం 2013 డిసెంబర్ 6 నుంచి అమల్లోకి తేవడంతో మనుషులంతా ఒక్కటే అనే భావన పెరిగిందని, మాన్యువల్ స్కావెంజర్ల పునరావాసం, ప్రత్యామ్నాయాన్ని కూడా చట్టం అందిస్తుందన్నారు. మురుగు కాలువలను మాన్యువల్‌గా శుభ్రపరిచే కార్మికుల ఆరోగ్యం, భద్రతకు పాటుపడుతూ, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ విధంగా చర్యలు చేపడుతున్న జిల్లా యంత్రాంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, డీసీపీ విద్యాసాగర్‌నాయుడు, జిల్లా అధికారులు, కార్మిక సంఘాల నేతలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు సత్కారం

ఎంవీపీకాలనీ: విదేశీ చదువులకు గురుకుల పాఠశాలల విద్యార్థులు ఎంపిక వారి ప్రతిభకు నిదర్శమని విశాఖ, అనకాపల్లి జిల్లాల గురుకుల పాఠశాలల సమన్వయాధికారిని ఎస్.రూపావతి అన్నారు. ఇటీవల ద కెన్నడీ- లూథర్ యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రాంలో భాగంగా యూఎస్ చదువుకు ఎంపికైన కొమ్మాది గురుకుల పాఠశాల, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఆర్.ఇవానింజలి, ఎస్.జ్ఞానేశ్వరరావుల సత్కార కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇందులో వెలకట్టలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి, పేద విద్యార్థుల అభ్యున్నతికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బాలవికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు, వీఎంసీ కళాశాల ప్రిన్సిపల్ జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


యూఎస్‌లో చదువుకు ఎంపికైన విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

అందుబాటులో అధికారులు

కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు


జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జోన్ పరిధి 40 నుంచి నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారుల ఫోన్ నంబర్లకు కాల్‌చేసి తెలియజేయవచ్చు. సూచనలు, సలహాలు ఇవ్వవచ్చు. జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు నేరుగా అర్జీలు సమర్పించవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జీ.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 పీఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-ఏ డీమ్డ్ పీఐవో(ఇంజినీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవీ(ఇంజినీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
రఘునాథ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి	70932 87310
డాక్టర్ సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	98485 02578
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్-బీ డీమ్డ్ పీఐవో(వాటర్ వర్క్స్ విభాగం)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డిప్యూటీ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్ విభాగం)	99123 49448
ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919



రహదారులను శుభ్రం చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ(ఫైల్)

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి..!

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. 42 నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించిన పారిశుధ్య సమస్యలు, చెత్త తొలగించపోయినా, గెడ్డలు, కాలువల్లో పూడికలు తీయకపోయినా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించాలని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వారు పట్టించుకోని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జెడ్సీ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్ల సమాచారం

వార్డు	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	ఔట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎస్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	పిహెచ్ మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

పెళ్లికి నిరాకరించిన యువకుడిపై ఫిర్యాదు

మద్రిపాలెం: తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిపై కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం రాసవీధికి చెందిన కంచి ఉషా అనే యువతి.. చంద్రమౌళి కశ్యప్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. వీరిద్దరూ ఓ ప్రైవేటు కాలేజీలో చదువుకున్నారు.

ఈ ఏడాది చదువు పూర్తి చేశారు. యువకుడు తనను పెళ్లి చేసుకునేందుకు ఇంట్లో ఒప్పించాడు. తీరా పెళ్లి చేసుకునే సమయానికి కట్నకానుకలు కావాలని పేచీ పెట్టాడు. అవి ఇస్తేనే పెళ్లని.. లేదంటే వేరే సంబంధం చూసుకుంటామని అనడంతో యువతి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ దివ్యభారతి కేసు దర్యాప్తు చేపట్టారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు.యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.